నమస్తే తెలంగాణ
భద్రాద్రి కొత్తగూడెం
5 | ఖమ్మం, బుధవారం 25 సెప్టెంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM

తిరుమలాయపాలెం: దెబ్బతిన్న పత్తి పంటను చూపుతున్న యువ రైతు (ఫైల్)

పేరుకు 'ముగ్గురు'న్నా.. పరిహారం గుండు సున్నా..

- పంట సాయం కోసం కళ్లు కాయలు కాసేలా కర్షకుల ఎదురుచూపులు
- ఇసుక మేటలు, మట్టి దిబ్బలు తొలగించేందుకు అన్నదాతల పాట్లు
- జిల్లాలో 27 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు అధికారుల నివేదిక
- జాబితా వెల్లడైతేనే పేర్లు లేని రైతుల సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశం

జిల్లాలో వానకాలం సీజన్ సాగు: 4,10,000 ఎకరాలు
ప్రాథమిక అంచనా ప్రకారం నష్టం: 79,000 ఎకరాలు
క్షేత్ర పరిశీలన తర్వాత పంట నష్టం: 27,908 ఎకరాలు
మొత్తం నష్టపోయిన రైతులు: 27,219 మంది

వ్యవసాయ ఆధారిత జిల్లా. జలాశయాలు, రిజర్వాయర్లు, చెరువులు, బావులు, సాగర్ ఆయకట్టు కింద ఏటా రెండు పంటలు పండించుకునే రైతులు. సాగుకే ప్రథమ ప్రాధాన్యమిచ్చే ఈ రైతులను 25 రోజుల క్రితం భారీ వర్షాలు, వరదలు అతలాకుతలం చేశాయి. నిండా ముంచాయి. రెండు పంటలు పండించుకునే భూములను పనికి రాకుండా చేశాయి. ఇసుక మేటలు, మట్టి దిబ్బలు, రాళ్లురప్పలతో నింపాయి. వాటిని మళ్లీ సాగుకు అనుకూలంగా మలచుకోవాలంటే రైతుల తరంకాని పరిస్థితి.

ఖమ్మం రూరల్: కొట్టుకుపోయిన వరి పంట

తిరుమలాయపాలెం: తమ పొలం నిండా వేసిన ఇసుక మేటను చూసి దిగాలు చెందుతున్న మహిళా రైతులు (ఫైల్)

మండలాల వారీగా పంట నష్టం వివరాలు ఇలా..

మండలం	రైతులు	ఎకరాలు
ఖమ్మం రూరల్	2,821	4,128
ముదిగొండ	3,139	3,843
కూసుమంచి	3,185	3,262
ఎర్రుపాలెం	3,249	3,228
మధిర	4,094	2,902
నేలకొండపల్లి	2,172	2,457
తిరుమలాయపాలెం	2,426	2,397
చింతకాని	1,667	1,481
బోనకల్లు	1,546	1,308
ఖమ్మం అర్బన్	486	621
రఘునాథపాలెం	681	614
కొణిజర్ల	496	531
వైరా	480	428
కామేపల్లి	468	332
సింగరేణి	107	112
వేంసూరు	58	83
తల్లాడ	27	53
కల్లూరు	39	50
పెనుబల్లి	61	45
ఏన్కూరు	7	12
సత్తుపల్లి	10	10

ఖమ్మం, సెప్టెంబర్ 24 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): జిల్లాలో వర్షాలు, వరదలు తగ్గి దాదాపు 20 రోజులు దాటింది. అయినా పంటలు కోల్పోయి, భూములు దెబ్బతిన్న రైతులకు ప్రభుత్వం నుంచి ఎలాంటి పరిహారమూ అందలేదు. పైగా సర్వేల పేరుతో పక్షం రోజులపాటు అధికారులు కాలయాపన చేశారు. ఇంతవరకు బాధిత రైతులకు ఎలాంటి న్యాయం జరగకపోవడంతో వారు ఆందోళన చెందుతున్నారు. ఎకరానికి రూ.10 వేల చొప్పున రైతులకు వరద సాయం అందిస్తామని ఒకసారి, పంట భూముల్లో ఇసుక మేటలు వేసిన రైతులకు మరింత సాయం అందిస్తామని మరోసారి చెప్పారు జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు. వారు అలా పలుమార్లు నొక్కి చెప్పినా కాసులు మాత్రం కర్షకుల ఖాతాల్లో పడలేదు. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వంలో మంత్రుల మాటలకు ఎంత విలువ ఉందో అర్థమవుతోంది. జిల్లాకు చెందిన ముగ్గురు మంత్రులు క్యాబినెట్‌లో ఉన్నా.. పరిహారం కోసం పైసా విదల్చలేదంటూ రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు.

తుడిచిపెట్టుకు పోయిన పంటలు..

ముఖ్యంగా మున్నేరు, ఆకేరు వాగు పరీవాహక ప్రాంతాల్లోని వందలాది ఎకరాల సాగు భూముల్లో భారీ వర్షాలు, వరదలతో ఇసుక మేటలు వేసిన విషయం విదితమే. వీటిని తొలగించడం రైతుల వల్ల కావడం లేదు. ఖర్చులు భరించలేక, పరిహారం ఇంకా అందక.. భారాన్ని మోస్తున్న రైతులు.. మేటలతో ఉన్న భూములను చూసి పుట్టెడు దుఃఖంలో మునిగిపోతున్నారు. ఈ నెల ఒకటో తేదీ వచ్చిన భారీ వర్షాలు, వరదలతో ఖమ్మం జిల్లావ్యాప్తంగా 27 వేల మంది రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఆయా రైతులకు సంబంధించి 27 వేల ఎకరాల్లో పంటలు పూర్తిగా తుడిచిపెట్టుకు పోయాయని వ్యవసాయ శాఖ అధికారులు తేల్చారు. నివేదికను ప్రభుత్వానికి పంపించారు. సర్వే చేసే క్రమంలో నష్టం అంచనాల్లో సైతం భారీగా కోతలు విధించినట్లు తెలుస్తోంది. 79 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగే అవకాశం ఉందని వరదలు తగ్గిన రెండు రోజుల్లోనే వ్యవసాయ శాఖ ప్రకటించింది. కేవలం 27 వేల ఎకరాల్లోనే పంట నష్టం జరిగినట్లు మరో పదిరోజుల తరువాత వెల్లడించింది. అయితే ఈ జాబితా వెల్లడైతేనే అందులో పేర్లు లేని రైతుల సంఖ్యపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. అయితే, పంట విలువ పూర్తిగా అంచనా వేసి అందుకు తగిన పరిహారం అందిస్తేనే బాధిత రైతులకు న్యాయం జరిగే అవకాశం ఉంటుంది.

మేటల తొలగింపునకు మోపెడు ఖర్చు..

రాళ్లు, రప్పలు మేట వేసిన పంట పొలం

అయితే పొలాల్లో పోగుపడ్డ ఇసుక మేటలు, మట్టి దిబ్బలు, రాళ్ల కుప్పలను తొలగించాలంటే భారీ ఖర్చుతో కూడుకున్న పని. ఒక్కో ఎకరానికి రూ.లక్ష చొప్పున ఖర్చయ్యే అవకాశం ఉంటుందని పలువురు రైతులు చెబుతున్నారు. వరి పొలాల్లో ఇసుక మేటలను తొలగించడంతోపాటు తిరిగి దుగాలు వేసుకోవాల్సి ఉంటుంది. సాగు భూముల నుంచి తొలగించిన మట్టి దిబ్బలు, ఇసుక మేటలను ట్రాక్టర్ల సాయంతో ఇతర ప్రాంతాలకు తరలించాల్సి ఉంటుంది. ఇదంతా సన్న, చిన్నకారు రైతులకు విషమ పరీక్షగా ఉంది. ఇక, నిరుటి యాసంగిలో సాగర్ నీరు రాకపోవడంతో ఆయకట్టు పొలాలు పూర్తిగా ఎండిపోయిన విషయం విదితమే. ఈ ఏడాది వానకాలంలో వచ్చిన భారీ వరదలు.. సాగు భూములను పనికి రాకుండా చేశాయి. ఈ క్రమంలో సర్కారు సాయం కోసం ఎదురుచూసిన రైతులకు నిరాశే మిగులుతోంది. సాయం ఎంతకూ రాకపోవడంతో కొందరు వడ్డీలకు తెచ్చి మరీ పొలాల్లోని మేటలు తొలగించుకుంటున్నారు. రాబోయే సీజన్‌లో నైనా పొలాన్ని రూపునకు తీసుకొస్తే వచ్చే రెండు మూడేళ్ల తరువాతైనా తిరిగి మాగాణిగా మారుతుందనే ఆశతో రైతులు దెబ్బతిన్న భూములను బాగు చేసుకుంటున్నారు. ఇంత జరుగుతున్నా.. కనీసం బాధిత రైతులను కలిసి 'మేమున్నాం..' అనే భరోసా ఇచ్చే పాలకులు జిల్లాలో కరువవడం గమనార్హం.

గింజ కూడా చేతికి రాదు..

నాకు పావు తక్కువ రెండెకరాల భూమి ఉంది. నీరు లేకపోవడంతో ఒక్క గింజ కూడా చేతికొచ్చే పరిస్థితి లేదు. పెట్టుబడితోపాటు ఇప్పటికే రూ.25 వేల నుంచి రూ.30 వేల వరకు ఖర్చు చేశాను. ఏం చేయాలో తోచడం లేదు. కలెక్టర్ కూడా నా పొలాన్ని చూశారు. మా గ్రామంలో వరదకు ఇసుక మేటలు వేశాయి. నీరు లేక పొలాలు ఎండిపోయిన నా లాంటి రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి.
-పడిశాల మైసయ్య, రైతు, జుర్ఖుల్‌రావుపేట, కూసుమంచి

పొలం ఎండిపోయింది..

వారం రోజులుగా సాగర్ నీళ్లు లేకపోవడంతో పొలం పూర్తిగా ఎండిపోయింది. జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు వచ్చి పంటను చూశారు. మొన్నటి వర్షాలతో ఇసుక మేటలు వేసిన రైతులు ఇబ్బందులు పడుతున్నారు. తండా పరిధిలో ఇసుక మేట వేసిన పొలాలు 20 ఎకరాల వరకు ఉన్నాయి. రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలి. పంట నష్టంతోపాటు ఇసుక మేట తొలగించడానికి ప్రత్యేంగా నిధులు కేటాయించాలి. **-నరేశ్, రైతు, హట్యాతండా, కూసుమంచి**

రెండెకరాల్లో వరిగడ్డే మిగిలింది..

నాకు సాగర్ నీరు తప్ప మరో మార్గం లేదు. కాల్వకు గండిపడిన 20 రోజుల సంది నీరు రాక పోవడంతో పొలం మొత్తం ఎండిపోయింది. నాకు ఇది తప్ప ఆదెరువు లేదు. నీరు ఇప్పుడు ఇచ్చినా నా పొలం పండదు. నాకున్న రెండెకరాల్లో వరి గడ్డి మాత్రమే మిగిలింది. ఇప్పటికే భూమి అంతా నెరెలు బారింది. ఏం చేయాలో తోచడం లేదు. మమ్మల్ని సర్కారు ఆదుకోవాలి.
-దాట్ల ముత్తయ్య, రైతు, మల్లాయిగూడెం, కూసుమంచి

పంటలు ఎండిపోతున్నాయ్

ప్రస్తుతం చేతికొచ్చిన పంటలు కళ్ల ముందే ఎండిపోతున్నాయి. ఏం చేయాలో దిక్కుతోచని పరిస్థితి నెలకొంది. గత వారంరోజులుగా రేపోమాపో నీళ్లు విడుదల చేస్తామని పేపర్లలో చూస్తున్నాం. ప్రతిరోజూ ఇదే కొనసాగుతుంది తప్ప పంటకు నీరు రావడం లేదు. ఇలా అయితే పెట్టిన పెట్టుబడులు కూడా రావు. తీవ్ర ఆందోళన చెందుతున్నాం.
- ఎర్రా కృష్ణ, రైతు, తుమ్మలపల్లి, కొణిజర్ల

కాలువలో ప్రవాహాన్ని పరిశీలిస్తున్న మంత్రి పొంగులేటి

- నీటి ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి పొంగులేటి
- 3 వేల క్యూసెక్కుల నీటి విడుదలకు ప్లాన్
- యూటీ నీటిని తోడేందుకు మోటర్లు

సాగర్ జలాలు విడుదల

కూసుమంచి, సెప్టెంబర్ 24: నాగార్జున సాగర్ ఆయకట్టులోని ఖమ్మం జిల్లా రైతులకు రాష్ట్ర ప్రభుత్వం ఎట్టకేలకు సాగునీటిని విడుదల చేసింది. పాలేరు కాలువకు ఇటీవల గండి పడి రాష్ట్ర వ్యాప్తంగా సంచలనమైన విషయం విదితమే. దీంతో పంటలు ఎండిపోతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో ఆగ్రహించిన మాజీ మంత్రి, బీఆర్ఎస్ నేత హరీశ్‌రావు సోమవారం హైదరాబాద్‌లో ప్రెస్‌మీట్ పెట్టి సర్కారు నిర్లక్ష్యాన్ని ఎండగట్టిన సంగతి తెలిసిందే. ఆ వెంటనే మంత్రి తుమ్మల స్పందించి కాలువను సందర్శించారు. పనులు వేగంగా చేయాలని అధికారులను ఆదేశించారు. దీంతో గండి కారణంగా నీళ్లు లీక్ అయిన ప్రాంతంలో సోమవారం నుంచే అధికారులు యుద్ధ ప్రాతిపదికన పనులు చేపట్టారు. ఎట్టకేలకు వాటిని పూర్తి చేసి మంగళవారం తెల్లవారుజాము నుంచి నీటిని విడుదల చేశారు. కాగా, ఈ నీటి ప్రవాహాన్ని రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మంగళవారం పరిశీలించారు. తదుపరి చర్యల గురించి ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. యూటీని పూడ్చి వేయడంతో లభించిన సమస్య పరిష్కారం, జిల్లాకు పూర్తిగా సాగునీరు అందిచేందుకు తీసుకుంటున్న జాగ్రత్తలు తదితర అంశాల గురించి వారితో మాట్లాడారు. ఈ క్రమంలో ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్, ఇరిగేషన్ చీఫ్ ఇంజినీర్ విద్యాసాగర్ ఆధ్వర్యంలో పలు ఆదేశాలు జారీ చేశారు. సాగర్ ఆయకట్టు ఖమ్మం జిల్లాలోని పంటలకు నీళ్లు అందని కారణంగా అవి ఎండుపోతున్నాయి. ఈ క్రమంలో ఇటీవలి వరదల సమయంలో అదే పాలేరు కాలువకు ఓ చోట గండి పడగా శనివారం నాటికి అధికారులు దానిని పూడ్చారు. ఆ తరువాత నీటి విడుదల కోసం ట్రయల్ రన్ వేశారు. ఈ క్రమంలో అండర్ టన్నెల్ (యూటీ) సమీపంలో కాలువ నీళ్లు మరోసారి నీళ్లు లీక్ అయ్యాయి. దీంతో సమస్య ఒక్కసారిగా మళ్లీ తీవ్రరూపం దాల్చింది. ఈ క్రమంలో యూటీని పేల్చి వేసి దానిని డమ్మీ చేశారు. అక్కడ స్టోర్ అయ్యే నీటిని నాలుగు 100 హెచ్‌పీ మోటర్ల ద్వారా తిరిగి నేరుగా కాలువలోకి పోయాలని నిర్ణయించారు. రాష్ట్ర రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మూడుసార్లు, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఒకసారి ఈ మరమ్మతుల పనులను పరిశీలించారు. అధికారుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. లీకేజీ పనులను కూడా ఎట్టకేలకు పూర్తి చేసి మంగళవారం తెల్లవారుజాము న 4:30 గంటలకు రింగ్‌బండ్ తీసేసి క్రమంగా నీటిని వదిలారు. మొదట 500 క్యూసెక్కులను విడుదల చేశారు. క్రమంగా సామర్థ్యాన్ని పెంచుతూ మంగళవారం రాత్రి వరకు 2000 వేల క్యూసెక్కుల నీటిని వదిలారు. బుధవారం ఉదయం వరకు మూడు వేల క్యూసెక్కుల నీటి విడుదలకు ప్రణాళిక రూపొందించారు.

బండ్ ఎత్తు పెంచి పూర్తిస్థాయిలో నీరు ఇవ్వాలి: పొంగులేటి

బండ్ ఎత్తును పెంచి బుధవారం వరకు జిల్లాలోని చివరి ఆయకట్టు రైతులకు కూడా పూర్తిస్థాయిలో నీటిని అందించాలని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అధికారులను ఆదేశించారు. బండ్ ఎత్తును ఇంకా 5 అడుగుల మేర పెంచి 3 వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేయాలని ఆదేశించారు. అయిదే బుధవారం ఉదయం వరకు ఈ పనులు పూర్తి చేస్తామని కాంట్రాక్టర్ ముత్తయ్యనాయుడు మంత్రికి సమాధానమిచ్చారు.

ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం..

నీటిని వదిలిన తరువాత కాలువ ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి పొంగులేటి.. ఎఫ్‌టీఎల్, కెనాల్ లెవెల్, బండ్ లెవల్ వంటి గణాంకాలను ఇరిగేషన్ అధికారులను అడిగారు. వారు సమాచారాన్ని ఇవ్వలేకపోవడంతో తీవ్రంగా ఆగ్రహించారు. 'వచ్చే నీటి ప్రవాహాన్ని ఎలా ఎదుర్కోంటారు? ప్రత్యామ్నాయం ఏంటి?' అని ప్రశ్నించారు. ఇద్దరు అధికారులను నియమించి గంటగంటకు దాని ప్రోగ్రెస్‌ను కలెక్టర్‌కు తెలియజేయాలని ఆదేశించారు. సత్తుపల్లి ఎమ్మెల్యే రాగమయి, ఈఈ అనన్య, డీఈ మధు, ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ సంజీవ్, ఎస్సై నాగగరాజు, నాయకులు పాల్గొన్నారు.

ఎండిన పంటలను పరిశీలించిన కలెక్టర్

- కూసుమంచి రైతులతో మాటామంతీ..
- పంటల నష్టానికి కారణాలపై ఆరా..

పాలం ఎండిపోయిన రైతు ముత్తయ్యతో మాట్లాడుతున్న కలెక్టర్

కూసుమంచి, సెప్టెంబర్ 24: కూసుమంచి మండలంలో ఎండిన పంటలను ఖమ్మం కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ మంగళవారం పరిశీలించారు. ఇటీవలి వరదల కారణంగా పాలేరు కాలువకు గండి పడడం, ఇటీవల యూటీ లీక్ కావడం, మొత్తంగా పాలేరు నుంచి సాగర్ నీటి విడుదల ఆలస్యం కావడం వంటి కారణాల నేపథ్యంలో పంటలు ఎండిపోతున్న విషయం విదితమే. ఈ క్రమంలో కూసుమంచి మండలంలో మంగళవారం పర్యటించిన కలెక్టర్.. తొలుత పాలేరు కాలువ నుంచి జరుగుతున్న నీటి విడుదల పరిశీలించారు. తరువాత ఇరిగేషన్, వ్యవసాయ, విద్యుత్ శాఖల అధికారులతో స్థానిక మత్స్య పరిశోధనా కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. క్షేత్రస్థాయికి వెళ్లి ఎండిన పంటలను పరిశీలించాలని ఆదేశించారు. తాను కూడా పలు గ్రామాలకు వెళ్లారు. మల్లాయిగూడెంలోని దాట్ల ముత్తయ్య, జుర్ఖుల్‌రావుపేటలోని పడిశాల మైసయ్యలకు చెందిన ఎండిన పొలాలను స్వయంగా పరిశీలించారు. బాధిత రైతులతో మాట్లాడారు. చుట్టూ ఉన్న పొలాలు పచ్చగా ఉండగా.. మీ పంటలే ఎందుకు ఎండిపోయాయంటూ రైతులను అడిగి తెలుకున్నారు. ఇందుకు ఆయా రైతులు స్పందిస్తూ.. తమకు బోర్లు, బావులు లేవని అన్నారు. ఈ కాలువే ఆధారమని సమాధానమిచ్చారు. దానిని నమ్ముకొనే పంటలు పండిస్తున్నామని, దాని నుంచి నీరు రాకపోవడంతోనే పంటలు ఎండిపోయాయని వివరించారు. ఇంకా ఎండిపోయిన పంటల గురించి డీఏవో పుల్లయ్య, ఏడీఏ సరిత, ఏవో వాణి, ఏఈవో రవితేజలను అడిగి తెలుసుకున్నారు. మల్లాయిగూడెం, జుర్ఖుల్‌రావుపేట తదితర ప్రాంతాల్లో 200 ఎకరాల్లో నష్టం జరిగిందని కలెక్టర్‌కు వివరించారు. అలా పంటలు దెబ్బతిన్న రైతుల వివరాలు సేకరించాలని, పంటల నష్టం వివరాలను అంచనా వేయాలని, బోర్ల ఏర్పాటుకు అంచనాలు రూపొందించాలని ఆదేశించారు.

ఉమ్మడి జిల్లాలో మోస్తరు వర్షం

దమ్మపేటలో పిడుగుపాటుకు ఇద్దరు మృతి

అశ్వారావుపేట టౌన్‌లో కురుస్తున్న వర్షం

భద్రాద్రి కొత్తగూడెం, నమస్తే తెలంగాణ/ ఖమ్మం వ్యవసాయం/ దమ్మపేట రూరల్/ అశ్వారావుపేట టౌన్, సెప్టెంబర్ 24: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మంగళవారం మోస్తరు వర్షం కురిసింది. తుఫాన్ ప్రభావంతో నిన్నటివరకు చెదురుమదురు జల్లులు పడినప్పటికీ మంగళవారం సాయంత్రం భద్రాద్రి జిల్లాలో భారీ వర్షం కురిసింది. కొత్తగూడెం, పాల్వంచ, చుంచుపల్లి, లక్ష్మీదేవిపల్లి, సుజాతనగర్, ఇల్లెందు, టేకులపల్లి, దమ్మపేట, అశ్వారావుపేట, చండ్రుగొండ, ములకలపల్లి మండలాల్లో జోరు వాన పడింది. ఖమ్మం నగరంలోనూ వాన దంచికొట్టింది. దీంతో ప్రధాన వీధులన్నీ జలమయమయ్యాయి. ఖమ్మం రూరల్, రఘునాథపాలెం, చింతకాని, కొణిజర్ల, కూసుమంచి తదితర మండలాల్లో మోస్తరు వర్షం కురిసింది. కాగా, వర్షాల్లేక బీటలు వారుతున్న వరి పంటకు ఈ వర్షం కాస్త ఊరటనిచ్చింది.

పిడుగుపడి ఇద్దరు కూలీలు మృతి

నాగశ్రీ, అనూష (ఫైల్)

దమ్మపేట మండలంలో మంగళవారం సాయంత్రం పిడుగుపడి ఇద్దరు మహిళా కూలీలు మృతిచెందగా.. మరో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. బూరుగుగుంపు, జగ్గారం గ్రామాలకు చెందిన సుమారు ఎనిమిది మంది మహిళా కూలీలు రోజూ మాదిరిగానే వ్యవసాయ కూలి పనులకు వెళ్లారు. పొలంలో పనిచేస్తుండగా సమీపంలో పిడుగుపడింది. దాని తీవ్రతతో బూరుగుగుంపునకు చెందిన కట్టం నాగశ్రీ (22), సున్నం అనూష (23) అక్కడికక్కడే మృతిచెందారు. జగ్గారం గ్రామానికి చెందిన మడివి సీతమ్మ, ఊకే రత్తమ్మ, కల్లూరి రాతమ్మ తీవ్రంగా గాయపడ్డారు. మెరుగైన వైద్యం కోసం వారిని ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. మిగిలిన మరో ముగ్గురు క్షేమంగా ఉన్నారు. మృతులిద్దరూ అవివాహితులు.

మొండిగోడలే మోడల్

- 'అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్'గా ఖమ్మం ఐటీఐ ఎంపిక
- బేస్‌మెంట్ దశలో ఆగిపోయిన భవన నిర్మాణం
- సదుపాయాల కల్పనకు మరో 3 నెలలు ఆగాల్సిందే..
- నేటి నుంచి 6 కొత్త కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులు
- అక్టోబర్ 1 నుంచి ప్రారంభంకానున్న తరగతులు


ప్రాథమిక దశలో ఉన్న నిర్మాణం

కొలువు సాధించాలంటే ఏళ్లకు ఏళ్లు చదువులు చదవాల్సిన అవసరం లేదు. పేరు పక్కన డిగ్రీలు అవసరం లేదు. ఐటీఐల్లో అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్(ఏటీసీ) కోర్సు పూర్తయితే చాలు.. దేశంలో ఎక్కడకు పోయినా వెంటనే ఉపాధి పొందేందుకు ఉద్దేశించినదే ఏటీసీ కోర్సు అంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రగల్భాలు పలికింది. ఉజ్వల భవిష్యత్ కల్పించే బాధ్యత మాది అంటూ గొప్పలకు పోయిన పాలకులు ఆచరణలో మాత్రం అభాసుపాలవుతున్నారు. వివరాల్లోకెళ్తే.. రాష్ట్రంలోని మూడు ఐటీఐలను మోడల్ అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌గా మారుస్తున్నట్లు ఏప్రిల్ 2024లో ప్రకటించినప్పటికీ ఇప్పటివరకు ఇంకా మొండిగోడలే దర్శనమిస్తున్నాయి. విద్యార్థులకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించకుండానే ప్రవేశాలకు అనుమతులిచ్చింది.
-ఖమ్మం ఎడ్యుకేషన్, సెప్టెంబర్ 24

రాష్ట్రవ్యాప్తంగా 65 ప్రభుత్వ ఐటీఐ(ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్స్) కళాశాలలున్నాయి. 65 కళాశాలలను అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్స్(ఏటీసీ)గా మార్చనుండగా, తొలిదశలో రాష్ట్రంలో మూడు ఐటీఐ కళాశాలలను ఏటీసీలుగా మార్చేందుకు ఎంపిక చేసింది. వాటిలో హైదరాబాద్‌లోని మల్లేపల్లి ప్రభుత్వ ఐటీఐ, నిజామాబాద్ ప్రభుత్వ ఐటీఐ, ఖమ్మం ప్రభుత్వ ఐటీఐ కళాశాలలున్నాయి. వీటిలో ఈ విద్యాసంవత్సరం నుంచి 6 కొత్త కోర్సులను నిర్వహించేందుకు నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఒకేషనల్ ట్రైనింగ్(ఎన్‌సీవీటీ) అనుమతులు ఇచ్చింది. వీటిల్లో సంవత్సరం కోర్సులు.. 1.మాన్యుఫాక్చరింగ్ ప్రాసెస్ కంట్రోల్ ఆటోమేషన్ 2.ఇండస్ట్రియల్ రోబోటిక్స్ అండ్ డిజిటల్ మాన్యుఫాక్చరింగ్ 3.ఆర్టిసాన్ యూజింగ్ అడ్వాన్స్‌డ్ టూల్స్ ఉన్నాయి. రెండేళ్ల కోర్సులు 1.బేసిక్ డిజైనర్ అండ్ వర్చువల్ వైరింగ్ 2.అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ టెక్నిషియన్ 3.మెకానిక్ ఎలక్ట్రిక్ వెహికల్ ఉన్నాయి.

అడ్వాన్స్‌డ్‌కి అవస్థలు..

మోడల్ కళాశాలలుగా ఎంపిక చేసిన కళాశాలలో ఖమ్మం ఐటీఐ ఒకటి. అడ్మిషన్స్ బాగా ఉన్నాయని, అప్రెంటిషిప్‌ల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొంటారనే కారణాలతో ఖమ్మం ఐటీఐ కళాశాలని ఎంపిక చేశారు. అడ్వాన్స్‌డ్ ట్రైనింగ్ సెంటర్‌గా ఏప్రిల్‌లో ఎంపిక చేస్తే భవన నిర్మాణానికి జూన్‌లో టెండర్స్ పిలిచారు. అప్పటికే రెండు నెలలపాటు కాలయాపన చేశారు. సెప్టెంబర్ వచ్చినా ఇంకా ప్రారంభ దశలోనే ఉండి అడ్వాన్స్‌డ్ సెంటర్ నిర్వహణకు అవస్థలు స్వాగతం పలకనున్నాయి. టీజీఐఐసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణం చేయనుండగా స్లాబ్ పద్ధతికి బదులుగా పీఈసీ విధానంలో 13వేల ఎస్ఎఫ్‌టీ నిర్మించేందుకు రూపకల్పన చేశారు. ఇందుకోసం ప్రభుత్వం రూ.4.77 కోట్లు కేటాయించింది. ఈ 13 వేల ఎస్ఎఫ్‌టీలో 6 నూతన కోర్సుల కోసం ల్యాబ్‌లతో కూడిన తరగతి గదులను నిర్మించాల్సి ఉంది.

పరికరాల భద్రత పరిస్థితి ప్రశ్నార్థకం..

నూతన కోర్సుల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వం టీటీఐఎల్ (టాటా టెక్నాలజీస్ లిమిటెడ్) సంస్థతో ఒప్పందం కుదుర్చుకుంది. ఈ సంస్థ మూడు సంవత్సరాలపాటు నిపుణులైన సిబ్బందితో విద్యార్థులకు శిక్షణ కల్పించాలి. విద్యార్థులతోపాటు అన్ని ఐటీఐ కళాశాలల్లోని అధ్యాపకులకు శిక్షణ కల్పించాలి. వీటితోపాటు రూ.10 కోట్ల విలువైన టూల్స్, పరికరాలు జిల్లాలో ప్రభుత్వ ఐటీఐకి చేర్చారు. వీటిని ఎక్కడ ఉంచాలో తెలియక ప్రస్తుతం ఉన్న ఫిట్టర్, ఇతర ల్యాబ్‌ల్లో భద్రపరిచారు. ఇతర కోర్సులకు సంబంధించిన ల్యాబ్‌ల్లో వీటిని ఉంచడంతో ల్యాబ్‌ల్లో ప్రయోగాలు చేసేందుకు వీలులేక ఇబ్బందులు ఎదుర్కోవడంతోపాటు నూతన పరికరాల భద్రత ప్రశ్నార్థకంగా మారింది. నూతన పరికరాలను అందుకు అనువుగా ఉన్న బల్లలపై బిగించాల్సి ఉండగా అందుకు అనుగుణంగా భవన నిర్మాణం కాకపోవడంతో తాత్కాలికంగా ఎక్కడ సర్దుబాటు చేయాలో తెలియని పరిస్థితి.

నేటినుంచి కొత్త కోర్సుల్లో ప్రవేశాలు..

ఖమ్మంలోని ఐటీఐలో ఇప్పటి ఎలక్ట్రిషియన్, సోలార్ టెక్నిషియన్, కూపా, డ్రస్ మేకింగ్, వెల్డర్, స్మార్ట్ అగ్రికల్చర్, డీఎం సివిల్ కోర్సులు ఉన్నాయి. వీటిల్లో ఇప్పటివరకు నాలుగు ఫేజుల్లో అడ్మిషన్ల ప్రక్రియను నిర్వహించగా 192 సీట్లకు 143 మంది విద్యార్థులు ప్రవేశాలు పూర్తయ్యాయి. అయితో ఫేజులో ఈ నెల 24 నుంచి 28వ తేదీ వరకు నూతన 6 కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తూ ప్రభుత్వం నోటిఫికేషన్ ఇవ్వడంతో ప్రిన్సిపాల్ అడ్మిషన్లకు అవసర మైన ప్రచార కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అక్టోబర్ 1వ తేదీ నుంచి నూతన కోర్సుల్లో తరగతులు నిర్వహించేందుకు షెడ్యూల్ విడుదలైంది. 6 కోర్సులను బోధించేందుకు ఒక్కో కోర్సుకు టీటీఎల్ సంస్థ ఇద్దరిని కేటాయించాల్సి ఉండగా ఇప్పటివరకు ఖమ్మం ఐటీఐకి ఇద్దరిని మాత్రమే కేటాయించింది.

ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం..

నూతన కోర్సుల నిర్వహణకు అవసరమైన భవనం సిద్ధంకాకపోయినా విద్యార్థులు ఇబ్బంది పడకుండా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నాం. కళాశాలలో ఉపాధి కల్పనాశాఖ ఆధీనంలో ఉన్న రెండు గదులను వినియోగించుకుంటాం.. నూతన ప్రయోగాల సామగ్రిని ఇతర ల్యాబ్‌లో భద్రపరిచాం. అడ్మిషన్లకు సంబంధించిన ప్రక్రియను నిర్వహిస్తున్నాం.
-శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్, ఖమ్మం ఐటీఐ